క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



పందలపాకలో అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గరిమెళ్ల విశ్వేశ్వరరావు(బుజ్జి) ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం సబ్బెళ్ల మంగయ్యమ్మ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు గొలుగూరి సత్యనారాయణ రెడ్డి, తమలంపూడి సూర్యనారాయణరెడ్డి, గొలుగూరి వెంకటరమణ రెడ్డి, సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి, మేడపాటి వీరరాఘవ గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం

రంగంపేట: పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్నట్టు బీజేపీ మండల అధ్యక్షుడు సాయిరాం తెలిపారు. శుక్రవారం ఎస్టీ రాజాపురం, కోటపాడు, రంగంపేట గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కేంద్ర పథకాలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయో వివరిస్తున్నామన్నారు.

రాజకీయ నేతలకు అమ్మిరెడ్డి ఆదర్శం



అమ్మిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

అనపర్తి: ప్రజాప్రతినిధిగా, స్వప్రయోజనాలు ఆశించకుండా సమాజ శ్రేయస్సుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి ఆశయాలు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి 82వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న పడాల అమ్మిరెడ్డి విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమ్మిరెడ్డి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమ్మిరెడ్డి తనయుడు, మాజీ జెడ్పీటీసీ పడాల రామారెడ్డి, విద్యాసంస్థల పాలక మండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, కర్రి రామారెడ్డి, తేతలి జగ్గిరెడ్డి, ఎస్.వెంకట సుబ్బారెడ్డి, సత్తి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కృషి, పట్టుదలతోనే ఉత్తమ ర్యాంకులు



సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

రంగంపేట: ఉత్తమ ర్యాంకులు సాధించడానికి కృషి, పట్టుదలతో నిరంతరం శ్రమించాలని గెజిటెడ్ హెచ్‌ఎం సంఘ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణారావు అన్నారు. శుక్రవారం చంద్రేడు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గంటా రమణబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రమణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకుంటే ఆదర్శ పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. కార్యక్రమంలో డీవైఈఓ ఈవీఎన్ఎస్ఎస్‌బీఎల్ నారాయణ ఆధ్వర్యంలో ప్యానల్ టీచర్ల ఉపాధ్యాయుల విద్యా బోధన పరిశీలించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బాపిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాభ్యాసాలను ప్రదర్శించారు.

రక్తదానం మహోన్నతం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: రక్తదానం చేయడమంటే మరొకరి ప్రాణాన్ని కాపాడటమేనని జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు, హమాలీలు సుమారు 90 మంది రక్తదానం చేశారు. వారికి షర్మిల అశోక సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బం, కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీ కుమార్, డిపో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, బస్ స్టేషన్ మేనేజర్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

పల్లెకు పెళ్లి కళ

- సమీపించిన మాఘమాస కల్యాణ ఘడియలు
- 13 నుంచి వివాహ ముహూర్తాలు
- పెళ్లిళ్లకే కాదు.. అన్నింటికీ కూడా..
- ఊపందుకున్న అనుబంధ వ్యాపారాలు

పెళ్లంటే.. కేవలం రెండు మనసుల కలయికే కాదు.. ఇరు కుటుంబాల పండగ. పిల్లల ఆనందోత్సాహాలు.. ఆడవారి ముచ్చట్లు.. మగవాళ్ల పంతాలు.. పెద్దల పట్టింపులు.. ఇలా ఎన్నో ఉంటాయి. ఇవన్నీ వివాహమనే శుభకార్యంలోనే గోచరిస్తుంటాయి. ముహూర్తమనే పవిత్ర 'ఘడియ'.. ఈ ఆనందాలన్నీ మూటగట్టుకుని వస్తుంది. కొద్ది రోజుల్లో మాఘమాసం సమీపిస్తుండడంతో.. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా, పెళ్లి పందిళ్లలో భాజాభజంత్రీలు మోగనున్నాయి.

బిక్కవోలు: అవివాహితులు ఎదురుచూసే మాఘమాసం రానే వచ్చింది. ఈ ఏడాది అనపర్తి నియోజకవర్గంలో పెళ్లి సందడి వాతావరణం నెలకొంది. ఎటు చూసినా పచ్చని పందిళ్లు, భాజాభజంత్రీలు కనిపిస్తున్నాయి. ఈ నెలలో పెద్ద సంఖ్యలోనే వివాహాలు జరగనుండటంతో ఊళ్లన్నీ పెళ్లికళ సంతరించుకున్నాయి. వివాహాలు ఓ వైపు ఉండగా, మరోవైపు నూతన గృహ ప్రవేశాలు, దుకాణాల ప్రారంభోత్సవాలు ఇలా అనేక కార్యక్రమాలకు శుభ ముహూర్తాలు ఉండడంతో, పురోహితులకు డిమాండ్ పెరిగింది. కొందరు తమ ఇళ్ల వద్ద వివాహాలు నిశ్చయించగా, మరికొందరు నివాస ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసుకోగా, అనేక మంది కల్యాణ మండపాలూ బుక్ చేసుకుంటున్నారు. పెళ్లి అనుబంధ వ్యాపారాలైన భాజాభజంత్రీలు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, ఫ్లవర్ డెకరేషన్, పెళ్లి సామగ్రి షాపులు, లైటింగ్, మైక్‌సెట్, బంగారు ఆభరణాలు, వస్త్ర దుకాణాల వద్ద హడావిడి పెరిగింది. అతిథులకు రకరకాల వంటకాలు చేయడానికి ముందుగానే వంట మాస్టారును వెతుక్కునే పనిలో ఉన్నారు.



జీలకర్ర, బెల్లం

మంచి ముహూర్తాలివే..

ఫాల్గుణ, వైశాఖ మాసాల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఫిబ్రవరి 13 నుంచి ఏప్రిల్ 26 వరకూ శుభ ఘడియలు ఎక్కువగా ఉన్నాయని దైవజ్ఞులు చెబుతున్నారు. మళ్లీ శ్రావణ మాసం వరకూ ముహూర్తాలు లేవంటున్నారు. ఫిబ్రవరిలో 13, 14, 24, 25, 29, మార్చిలో 2, 17, 22, 24, 27, 28, 30, ఏప్రిల్‌లో 3, 4 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు అంటున్నారు.

మే నుంచి మూఢం.. జూలైలో ఆషాడం

ఈ ఏడాది మే ఒకటి నుంచి జూన్ ఏడు వరకు శుక్ర మూఢం, మే ఐదు నుంచి జూన్ ఒకటి వరకు గురు మూఢం ఉంది. ఆయా సమయాల్లో ఎటువంటి శుభకార్యాలు చేయకూడదని పండితులు చెబుతున్నారు. తర్వాత ఆగస్టు 4 వరకు ఆషాఢ మాసంలో శుభకార్యాలుండవు. అక్కడి నుంచి శ్రావణ మాసంలో వివాహాలకు అవకాశం ఉంది.

డ్రోన్ ఫొటోగ్రఫీ ప్రత్యేకత

ఫొటోగ్రఫీ, వీడియోలకు గిరాకీ పెరగడంతో.. డిమాండ్‌ను బట్టి వీడియోగ్రాఫర్లు కొత్త పంథాలను ఆశ్రయిస్తున్నారు. గగనతలం నుంచి అత్యంత నాణ్యతతో ఫొటోలు, వీడియోలు తీస్తుండడంతో డ్రోన్ ఫొటోగ్రఫీకి ఆదరణ పెరిగింది. ఒక్కో కార్యక్రమానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ తీసుకుంటున్నారు. ప్రింటింగ్ ఖర్చులు అదనం.



వివాహానికి అలంకరించిన కల్యాణ మండపం

మంగళ వాయిద్యాలకూ గిరాకీ

హిందూ సంప్రదాయంలో భాజాభజంత్రీలు లేనివే పెళ్లిళ్లు జరగవు. అందుకే మంగళ వాయిద్యాలకు తొలి ప్రాధ్యానం ఉంటుంది. వధూవరులను సిద్ధం చేయడం మొదలు.. పెళ్లయ్యాక వారిని ఇంటికి తీసుకొచ్చే వరకూ వీటి అవసరం ఉంటుంది. బ్యాండ్ మేళాలు ఒక్కో కార్యక్రమానికి రూ.పది వేల పైగా తీసుకుంటున్నాయి. కొందరు సంగీత విభావరులు నిర్వహిస్తున్నారు. ఇందుకు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ కళాకారులు తీసుకుంటున్నారు.

విందు.. పసందు

పెళ్లిళ్లకు విందులే ప్రధాన ఆకర్షణ. భోజనాలు రుచిగా, శుచిగా ఉండాలని, బంధుమిత్రుల్లో మాట రాకూడదని భావిస్తుంటారు. అందుకే ఎంత ఖర్చయినా వెనుకాడరు. ఉదయం టిఫిన్ మొదలు.. రాత్రి విందు వరకూ భోజనం సరఫరా చేసే కేటరింగ్ సంస్థలు చాలానే ఉన్నాయి. మెను ప్రకారం ధర వసూలు చేస్తారు. ప్లేటు ధర రూ.120 నుంచి రూ.350 వరకు అందుబాటులో ఉన్నాయి.

పసిడి ధరపై ప్రభావం

మార్కెట్‌లో బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. శుభముహూర్తాలు సమీపించడంతో బంగారంపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. వారం రోజులుగా పసిడి ధర పెరుగుతూ వస్తోంది. అలాగే పూల ధరలూ ఆకాశాన్నంటాయి.

మంచి ముహూర్తాలు



ఈ నెలలో మంచి ముహూర్తాలున్నాయి. ప్రస్తుతం శుభ కార్యక్రమాలు చేసేందుకు అనుకూలంగా ఉండటంతో, ఎక్కువ మంది వివాహాలకు, గృహ ప్రవేశాలు, అక్షరాభ్యాసం వంటి శుభ కార్యక్రమాలు చేసుకుంటున్నారు. మే ఒకటి నుంచి మూఢం ప్రారంభమవుతుంది.

– గరిమెళ్ల విశ్వేశ్వరరావు, పండితుడు, పందలపాక

దృష్టంతా వంటకాలపైనే..



పెళ్లిళ్ల సీజన్ వస్తే చాలు రకారకాల వంటకాలతో భోజనప్రియులను మెప్పించాలి, మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త వంటకాలను రుచి చూపించాలి. అందుకనుగుణంగా మేం సమాయత్తమవుతున్నాం. శాఖాహార భోజనాన్ని నాన్ వెజ్ తలపించేలా వంటకాలు చేయడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

– గొద్దు సూర్యనారాయణ, వంట మాస్టర్, ఆరికరేవుల

అవకాశాలు బాగా ఉన్నాయి



గతంలో ఏ చిన్న ఫొటో తీయాలన్నా ఫొటోగ్రాఫర్ అవసరం ఉండేది. ఇప్పుడు స్మార్ట్ ఫోన్ వల్ల ఫొటోగ్రాఫర్‌కు పని తగ్గింది. మారుతున్న కాలానికి అనుగుణంగా డ్రోన్, డిజిటల్ ఫొటోషూట్ వల్ల అవకాశాలు గణనీయంగా పెరిగాయి. మాఘమాసంలో తీరిక లేకుండా అవకాశాలొస్తున్నాయి.

– జి.భద్రరావు, వీడియో-ఫొటోగ్రాఫర్, పందలపాక

రైతులు 15లోగా ఈ-కేవైసీ చేయించాలి

పెదపూడి: మండలంలో వ్యవసాయ శాఖ చేపట్టిన పంట నమోదు పూర్తయిన రైతులందరూ తప్పనిసరిగా ఈ నెల 15లోపు ఈ-కేవైసీ చేయించాలని మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. పుట్టకొండ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతుల నుంచి ఈ-కేవైసీ (వేలిముద్రల సేకరణ) ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈ-కేవైసీ చేసి, పంట నమోదు ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు. ఈ-కేవైసీ అయితేనే పంట నమోదు ప్రక్రియ పూర్తయినట్టని స్పష్టం చేశారు. రైతు భరోసా కేంద్రానికి వెళ్లేటప్పుడు ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మండలంలో 17,650 ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. ఇందులో 16,767 ఎకరాల్లో 95 శాతం మేరకు ఈ-క్రాప్ నమోదైందని వివరించారు. వీటిలో 60 శాతం ఈ-కేవైసీ పూర్తయిందని తెలిపారు.



పుట్టకొండ ఆర్బీకేలో రైతు వద్ద ఈ-కేవైసీ నమోదు చేస్తున్న వీఏఏ

ఎస్కేఆర్‌లో అజోల్లా పెంపకం

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అజోల్లా పెంపకం ప్రారంభించారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి శుక్రవారం తెలిపారు. రైతు సాధికారక సంస్థ సభ్యుడు ఎం.గురువు నాయుడు బోటనీ ప్రథమ,ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు దీని పెంపకాన్ని వివరించారు. అజోల్లా అనేది జీవన ఎరువు అని, పశువుల ఆహారం, మొక్కల పెంపకంలో దీని ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి ఎం.శ్రీదేవి మాట్లాడుతూ అజోల్లాని కోళ్లకి, పశువులకు దాణాగా వేయడం వల్ల వాటికి బలం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, వృక్ష శాస్త్ర విభాగాధిపతి ఎం.శ్రీదేవి, అధ్యాపకులు టి.నాగముని, బి.ఆశాలత పాల్గొన్నారు.

ప్రశాంతంగా కోరుకొండ మండల సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వి.హేమసుందర రావు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి సోమవారం వరకూ వలంటీర్ల ద్వారా సర్వే నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రభుత్వ అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. గ్రామాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాలను మెరుగుపర్చడం కోసం ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు జరపాలన్నారు. సారా రహిత గ్రామీణ వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు సెబ్ అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ పనితీరును మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. కచ్చా కాలువల స్థానంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎండీపీవోను ఎంపీపీ సూర్యకుమారి, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉల్లి బుజ్జిబాబు ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ జగనన్న పాలనలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. వైస్ ఎంపీపీలు బొర్సు నాగమణి, కొయిడాల స్వర్ణకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీవో హేమసుందరరావును సత్కరిస్తున్న నాయకులు

రేపే ఆడపడుచుల ఆశీర్వాద సభ

- రాజానగరంలో ముమ్మర ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న మహిళలు

రాజానగరం: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు మరోసారి పట్టం కట్టాలనే సంకల్పంతో రాజానగరంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆడపడుచుల ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. గడచిన నాలుగేళ్ల పది నెలల్లో నియోజకవర్గంలో ప్రతి గ్రామం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించేలా రూ.1,168 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రూ.1,148 కోట్లను ఆడపడుచులకు అందజేశారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటింటికీ గోదావరి జలాలను అందించేలా రూ.215 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలు చేసి, ఇంటింటికీ కుళాయిలు వేయించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆడపడుచుల ఆశీసులు మరోసారి పొందాలనే సంకల్పంతో ఈ సభను నిర్వహిస్తున్నారు.



మహిళలను ఆహ్వానిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

చురుకుగా ఏర్పాట్లు

సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల నుంచి భారీ ఎత్తున మహిళలు తరలివచ్చే ఈ సభకు జాతీయ రహదారిని ఆనుకుని రాయల్ కన్వెన్షన్‌కి ఎదురుగా ఉన్న మైదానంలో అవసరమైన ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. నియోకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి, మహిళలకు ఆహ్వానం పలికారు.

పల్లెకు పోదాం పోస్టర్ల పంపిణీ

సీతానగరం: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ముద్రించిన పుస్తకాలు, పోస్టర్లను బుక్స్, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి తన పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం కాటవరంలో పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు గూడపాటి జయరావ్ తదితరులు ప్రతి ఇంటికి వెళ్లి బీజేపీ పథకాలను వివరించారు. వీరన్న చౌదరి మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు సాంబేలపు బాలయోగి, సత్యం రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'పల్లెకు పోదాం'

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయడానికి బీజేపీ చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమం శుక్రవారం లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగింది. ఆ పార్టీ నాయకులు బొమ్ముల సతీష్, చిక్కం మోహిని, అడబాల గణపతి, ఆళ్ల శివనాగరాజు తదితరులు హెల్త్ కేర్ సెంటర్లు, పోస్టాఫీసు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉన్నత పాఠశాలలను సందర్శించి, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనంలో నాణ్యత, శుభ్రతలపై ఆరా తీశారు.



కాటవరంలో పల్లెకు పోదాం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీరన్న చౌదరి

జగనన్న సురక్షలో 471 మందికి వైద్య సేవలు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి సచివాలయం -1లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, డాక్టర్ ఎన్.మేఘన, స్పెషలిస్టులు రోజా చైతన్య, కంటి వైద్యుడు కె.సత్యప్రసాద్ తదితరులు శిబిరంలో 471 మందికి వైద్య సేవలు అందించారు. 31 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో 29 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించారు. గతంలో పరీక్షించిన ఏడుగురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 10 మందికి ఈసీజీ, 165 మందికి ల్యాబ్ టెస్ట్‌లు చేశారు. రోగులకు అవసరమైన మందులను సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, వడ్లమూరి దివాకర్ వర్మ, సూరపురెడ్డి రామకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యవాణి, సీహెచ్‌వో వెంకటరత్నం, ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ కె.సుధాకర్, జి.దైవకృప పాల్గొన్నారు.



చినకొండేపూడిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- వారి అభ్యున్నతికి సీఎం జగన్ కృషి
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: మహిళా సాధికారత సాధనే లక్ష్యంగా, స్వయం సహాయక సంఘాల మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం గాడాల, మధురపూడి గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం ఆమె సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను మహారాణులుగా చూడాలన్న ఆకాంక్షతోనే అనేక సంక్షేమ పథకాలను జగన్ అమలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరిగిందన్నారు. మధురపూడిలో రూ.4.37 కోట్లు, గాడాలలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.4, 10 లక్షలు మాత్రమే కేటాయించిందని తెలియజేశారు. రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, ప్రజలను నట్టేట ముంచిన చంద్రబాబు, జనసేన కూటమిని ఓడించాలని కోరారు. సమావేశంలో పార్టీ కోరుకొండ మండల కో కన్వీనర్ గణేశుల పోసయ్య, నాయకులు చాటపర్తి దుర్గారావు, ఇండిగమెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



మధురపూడిలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

పిల్లల అనారోగ్యానికి నులి పురుగులే మూలం

పెదపూడి: పిల్లల్లో చాలా అనారోగ్య సమస్యలకు నులి పురుగులే కారణమని సర్పంచ్‌ల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు, రామేశ్వరం సర్పంచ్ కొటికలపూడి చినబాబు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రామేశ్వరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చినబాబు మాట్లాడుతూ కడుపులో నులి పురుగులు ఉన్నట్టు గుర్తిస్తే, సులభ పద్ధతిలో వైద్యులు చికిత్స చేస్తారన్నారు. ఈ మాత్రలతో కడుపులోని నులి పురుగులను నివారించవచ్చన్నారు.

పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యం

బిక్కవోలు: వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చిన్నారులకు మాత్రలు వేశారు. పందలపాకలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనంతలక్ష్మి, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పడాల కృష్ణారెడ్డి, గొలుగూరి నాగిరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

98 శాతం మాత్రల పంపిణీ

సీతానగరం: మండలంలోని 12,318 మందికి గాను 12,078 మందికి ఆల్బెండజోల్ మాత్రలను మింగించి, 98 శాతం పూర్తి చేశామని పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది నుంచి 19 ఏళ్ల పిల్లలతో ఈ మాత్రలు మింగించారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం కస్నూరి సతీష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణప్రసాద్, తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ మస్తాన్, ఎంఈవో కె.స్వామినాయక్, పీఎంసీ చైర్మన్ బి.సూర్యకుమారి పాల్గొన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ నులిపురుగుల నివారణతో కలిగే ఆరోగ్య ఫలితాలను విద్యార్థులకు వివరించారు.



పందలపాకలో చిన్నారికి మాత్రలు వేస్తున్న హరిప్రసాద్‌రెడ్డి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుని, నులిపురుగుల నివారణకు సమాయత్తం కావాలన్నారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు ఎ.వాణి మాట్లాడుతూ నులిపురుగులతో వచ్చే సమస్యలను ప్రస్తావించారు. అనంతరం ఏఎన్ఎం షేక్ మున్నీషా బేగం అందించిన మాత్రలను విద్యార్థులు వేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బారావు, డాక్టర్ ఎం.సుధామయి, మీనాక్షి, డీవీ నాగేశ్వరరావు, ఫణీంద్ర, కుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం

మధురపూడి: నులి పురుగుల నివారణే లక్ష్యంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్టు గుమ్ములూరు హైస్కూల్ హెచ్‌ఎం యు.గంగాభవాని అన్నారు. శుక్రవారం ఆ స్కూల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



రామేశ్వరంలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న సర్పంచ్ చినబాబు



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపీపీ జ్యోత్స్న



గుమ్ములూరు హైస్కూల్లో విద్యార్థినికి మాత్రలు వేస్తున్న హెచ్‌ఎం